
# ఏపీ బీజేపీకి ఏమైంది?

- నేతలు ఎవరికి వారే..
- పార్టీ పెద్దల ఆగ్రహం 3





ఓకే తెలుగు
OKtelugu
క్షణం క్షణం.. నిఖార్సైన సమాచారం..

1 శుక్రవారం 05-06- 2026





- టీడీపీ వ్యూహాత్మక దాడి
- 2029పై వైసీపీకి కొత్త టెన్షన్
- ప్రజల్లోకి వెళ్లిన ప్రతికూల ఇమేజ్
- కేడర్‌ను కలవరపెడుతున్న ప్రచారం

రాజకీయాల్లో 'కత్తి' లాంటి విమర్శల కంటే.. 'గొడ్డలి' లాంటి ముద్రలే ఎక్కువ దెబ్బతీస్తాయని వైసీపీకి ఆలస్యంగా బోధపడినట్టుంది. 2019లో సానుభూతిని పంచిన అదే గొడ్డలి.. 2024 కొచ్చేసరికి 'రివర్స్ టెండరింగ్' లాగా రివర్స్ అయి కూర్చుంది. ప్రత్యర్థులు విసిరిన విమర్శల తూటాలకు బదులుగా 'గన్ కల్చర్' అంటూ వైసీపీ వేసిన కౌంటర్లు కాలికి తగిలినంత పనిచేయలేదు గానీ, ఈ 'గొడ్డలి' ముద్ర మాత్రం పార్టీ ఇమేజ్‌ను నరికేస్తోందని కేడర్ తెగ కంగారుపడిపోతోంది. అప్పట్లో తాతగారి ఫ్యాక్షన్ ముద్రను తుడిచేయడానికి తండ్రిగారు పాదయాత్రలు చేయాల్సి వస్తే.. ఇప్పుడు జగనన్న ప్రెస్ మీట్ లో చేసిన 'స్వయంకృతాపరాధం' కామెంట్స్, 2029 వరకు పార్టీకి నిద్రలేకుండా చేసేలా ఉన్నాయంటూ తమ్ముళ్లు తెగ ఫీలవుతున్నారు! 2

ఒకేతెలుగు ఏపీ బ్యూరో




## మూవీ రివ్యూ

## పెద్ది.. ఉప్పెన తర్వాత చద్ది!

- కథలో లేని లాజిక్.. చరణ్ కష్టాన్ని చెడగొట్టిన 'జాన్వీ' మ్యాజిక్! 8
- సినిమా నిడివి 'పెద్ద'దే.. కానీ కమర్షియల్ విందు మాత్రం 'చద్ది'దే!

అంచనాలు ఆకాశాన్ని తాకినప్పుడు.. అరిటాకులో 'పెద్ది' లాంటి ఊరమాస్ బిరియానీ వడ్డిస్తారనుకుంటే.. థియేటర్లలో ప్రేక్షకులకు మూడు గంటల పాటు నిల్వ ఉన్న 'చద్ది' అన్నం తినిపించినంత పని చేశారు దర్శకుడు బుచ్చిబాబు! రామ్ చరణ్ కష్టాన్ని, రత్నవేలు విజువల్స్‌ని నమ్ముకుని థియేటర్‌కి వెళ్తే.. లాజిక్ లేని లవ్ ట్రాకులు, సాగదీసిన సీన్లతో ఓపికకు పెద్ద పరీక్షే పెట్టారు. గ్లోబల్ స్టార్ వన్-మ్యాన్ షో కోసం ఒకసారి చూడొచ్చేమో కానీ, ఓవరాల్‌గా ఈ 'పెద్ది'.. బాక్సాఫీస్ దగ్గర మాత్రం కాస్త 'సద్ది' మొహం వేసిందనే చెప్పాలి!


## అదీ పవన్ కళ్యాణ్ అంటే..

- వైసీపీకి మామూలు స్ట్రోక్ ఇవ్వలేదుగా..
- తెలంగాణలో పవన్ రాజకీయ బాంబ్
- వైఎస్సార్‌పై పవన్ ఘాటు వ్యాఖ్యలు
- గులాబీ-వైసీపీ బంధంపై పవన్ ఫైర్
- పవన్ దెబ్బకు ప్రత్యర్థుల్లో కలకలం 5



నిన్నటిదాకా తెలంగాణకు బద్ధ శత్రువు అన్న వైఎస్సార్.. నేడు గులాబీ మీడియాకు పరమ పూజ్యుడైపోయారు. ఇటు కేటీఆర్-జగన్ బెంగళూరు ముచ్చట్లు, అటు సోషల్ మీడియాలో ఒకరి వీపు ఒకరు చరుచుకునే వైసిపి-బిఆర్ఎస్ బంధాన్ని చూసి జనాలు మురిసిపోతున్న తరుణంలో.. జనసేనాని ఒక్కసారిగా 'ఫ్లాష్ బ్యాక్' రీల్ తిప్పారు. నాడు వైఎస్సార్ ఉద్యమాన్ని ఎలా తొక్కేసారో చెప్తూ పవన్ కళ్యాణ్ ఇచ్చిన 'రివర్స్ థెరపీ'తో.. అటు నమస్తే తెలంగాణకు, ఇటు వైసిపి మీడియాకు గొంతులో పచ్చి వెలగకాయ పడ్డట్టయింది. పవన్‌ను 'ఆంధ్ర నేత' అని ముద్ర వేయబోయి, పాత ఫోటోలు బయటపడి గులాబీ తమ్ముళ్ల కలర్ వెలిసిపోతే.. మధ్యలో వైసిపి ఎమ్మెల్యే భూ కుంభకోణం కూడా బయటపడి స్క్రిప్ట్ మొత్తం రివర్స్ అయింది!



5

సాధారణంగా రాజకీయాలలో కొందరి మధ్య వైరం అనేది అంత ఈజీగా సాధ్యం కాదు. ఎందుకంటే వారి మధ్య అటువంటి వ్యవహారాలు ఎప్పుడూ చోటు చేసుకోవు కాబట్టి.. ప్రజలు ఆ విధంగా ఆలోచించరు. కానీ తెలంగాణలో అందుకు విరుద్ధమైన పరిస్థితులు చోటుచేసుకున్నాయి.. ఎవరు ఊహించని విధంగా.. కలలో కూడా అనుకోని విధంగా రాజకీయ వైరం ఏర్పడింది. అది కాస్త ఒక రకమైన సంచలనానికి దారితీసింది. ఇది ఎటువైపు వెళుతుంది.. దేని వైపు దారితీస్తుందో చూడాలి.

# వైసీపీపై గొడ్డలి ముద్ర

## టీడీపీ వ్యూహాత్మక దాడి

## వచ్చే ఎన్నికల్లో ప్రభావం

## కేడర్ లో అదే ఆందోళన

(ఓకే తెలుగున్యూస్)


వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది. ఆ పార్టీ ఎంత ఉవ్వెత్తున ఎగసిందో.. అదే స్థాయిలో వ్యతిరేక ప్రచారానికి బాధిత వర్గంగా మారింది. ముఖ్యంగా వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించి ఆ పార్టీ సానుకూలత పొందింది. 2019 ఎన్నికల్లో సానుభూతి పనిచేసే ఆ పార్టీ విజయం సాధించింది. కానీ 2024 ఎన్నికలకు వచ్చేసరికి అదే ప్రతికూలతగా మారింది. వ్యతిరేక ప్రచారంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దారుణ ఓటమి ఎదురయింది. అయితే ఇప్పుడు అదే అంశం 2029 ఎన్నికల వరకు సజీవంగా ఉంటే పార్టీకి నష్టం అని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది.

**ప్రజల్లోకి బలంగా..**

ప్రధానంగా గొడ్డలి పార్టీ అనే మాట.. ఆ పార్టీ శ్రేణులను కలవరపాటుకు గురిచేస్తోంది. ప్రారంభంలో పెద్దగా సీరియస్ గా తీసుకోలేదు ఆ పార్టీ. కానీ క్రమేపి అది ప్రజల్లోకి వెళ్ళింది. జగన్మోహన్ రెడ్డి దీనిపై వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఎవరిదయ్యా గొడ్డలి పార్టీ అంటూ ప్రశ్నించారు. గన్ కల్చర్ అంటూ టిడిపి పై ఆరోపణ చేశారు. అదే విషయాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు శృతి పంచుకున్నారు. గన్ కల్చర్ అంటూ ఆరోపణలు చేశారు. కానీ వైసీపీకి గొడ్డలి పార్టీ అనే ముద్ర చాలా వేగంగా వెళ్ళిపోయింది. కానీ టిడిపికి గన్ కల్చర్ అనే పేరు పెద్దగా వర్కౌట్ కాలేదు. కచ్చితంగా ఇది ప్రభావం చూపుతోందన్న భయం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉంది. అందుకే గొడ్డలి పార్టీ అనే కామెంట్స్ ను సహించుకోలేకపోతున్నారు. సోషల్ మీడియాలో ఎవరైనా కామెంట్స్ చేస్తే తట్టుకోలేకపోతున్నారు.

**అప్పట్లో రాజశేఖర్ రెడ్డి..**

ఇప్పటికే గొడ్డలి పార్టీ అనే పేరు ప్రజల్లోకి బలంగా వెళ్ళిపోయింది. అంతలా ప్రత్యర్థి పార్టీకి చెందిన మీడియా సోషల్ మీడియా దీనిని బలంగా తీసుకెళ్లగలిగింది. వాస్తవానికి 2004 కంటే ముందే ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైయస్ రాజశేఖర్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టాలి. కానీ ఫ్యాక్షన్ ముద్ర రాజశేఖరరెడ్డిని ముఖ్యమంత్రి కాకుండా చేసింది. ఆ కుటుంబం పై అంతలా ప్రచారం అప్పట్లో నడిచింది. వైయస్ రాజారెడ్డి యాక్షన్ ముద్ర రాజశేఖర్ రెడ్డి హయాంలో కూడా ప్రభావం చూపింది. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి హయాంలో ఫ్యాక్షన్ ప్రచారం పతాక స్థాయికి చేరింది. అది కూడా జగన్ మోహన్ రెడ్డి స్వయంకృతాపమే. ఎందుకంటే ప్రెస్మీట్లో తన తాతను చంపిన వారిని సైతం తాను ఏం చేయలేదని చెప్పి ఆ తేనె తుట్టను కదిపారు. అయితే ఇప్పుడు గొడ్డలి పార్టీ అంటేనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విలవిలలాడిపోతుంది.



# కొత్త అధ్యాయం!

## విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే

## కార్యకలాపాలు ప్రారంభం

## ఉత్తరాంధ్ర ప్రజలకు తీరిన కల



(ఓకే తెలుగున్యూస్)

ఉత్తరాంధ్ర చరిత్రలో మరో అధ్యాయం ప్రారంభం అయ్యింది. విశాఖ రైల్వే జోన్ అధికారిక కార్యకలాపాలు ఈరోజు నుంచి ప్రారంభం అయ్యాయి. విశాఖలోని డెక్ భవనంలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం ప్రారంభం అయింది. నూతన జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ తో పాటు ఇతర అధికారులు డెక్ భవనంలోకి ప్రవేశించారు. కేంద్ర ప్రభుత్వం జూన్ 1 నుంచి విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు చెప్పిన సంగతి తెలిసిందే. అనుకున్న మాదిరిగానే ఈరోజు నుంచి రైల్వే జోన్ కార్యకలాపాలు మొదలయ్యాయి. ఇది ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల. ఆపై ఏపీ ప్రజలు కూడా ప్రత్యేక రైల్వే జోన్ కోసం దాదాపు పుష్కర కాలంగా వేచి చూస్తున్నారు. ఇప్పుడు ఆరోజు రానే వచ్చింది.

***విభజన హామీగా..***

రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా ప్రత్యేక రైల్వే జోన్ కేటాయిస్తామని అప్పట్లో చెప్పారు. కానీ గత పుష్కర కాలంగా జాప్యం జరుగుతూ వచ్చింది. 2018లో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసింది. ఇంతలో అధికార మార్పిడి జరిగింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైల్వే జోన్ పురోగతి అంతంత మాత్రమే. కనీసం రైల్వే జోన్ కార్యాలయాల నిర్మాణానికి స్థలాలు కూడా కేటాయించలేని స్థితిలో ఉండిపోయింది వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జోన్ వేగవంతం అయింది. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రకటన చేయడమే కాదు ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో జోన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ముడసర్లోవలో శాశ్వత భవన నిర్మాణ పనులు జరుగుతుండగా.. విశాఖ నడిబొడ్డున ఉన్న డెక్ భవనంలో జోన్ తాత్కాలిక కార్యకలాపాలు ప్రారంభం అయ్యాయి.

ఇప్పటివరకు రాష్ట్ర రైల్వే లైన్ భూభాగం ఎక్కువ పరిధి దక్షిణ మధ్య రైల్వే లో ఉండేది. ఉమ్మడి రాష్ట్రంలో సికింద్రాబాద్ కేంద్రంగా దక్షిణ మధ్య రైల్వే కొనసాగేది.మరోవైపు భువనేశ్వర్ కేంద్రంగా ఉండే ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలో కూడా ఉత్తరాంధ్రలో కొంత ప్రాంతం ఉండేది.

అయితే దక్షిణ కోస్తా రైల్వే జోన్ విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు దక్షిణ మధ్య రైల్వే జోన్ లో కొనసాగుతున్న విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లను విశాఖ జోన్లో చేర్పించారు. పునర్వ్యవస్థీకరణలో భాగంగా వాల్తేరు డివిజన్ కనుమరుగు అయింది. దాన్ని స్థానంలో విశాఖ రైల్వే డివిజన్ ప్రారంభం అయింది. అది కూడా కొత్త జోన్ పరిధిలో చేర్చారు.ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ లో ఉన్న శ్రీకాకుళం, విజయనగరం పరిధిని కూడా విశాఖ రైల్వే జోన్ లో చేర్చారు.ఈ జోన్ నెట్వర్క్ 3,532 కిలోమీటర్ల రైల్వే లైన్.. 382 రైల్వే స్టేషన్లు కలిగి ఉంటుంది. 62,000 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తారు. సుమారు 100 మిలియన్ టన్నుల సరుకు రవాణా జరుగుతుంది. రూ.15,500 కోట్ల వార్షిక టర్నవర్ జరగనుంది. తమిళనాడు తో పాటు కర్ణాటక రాష్ట్రాల పరిధిని కూడా విస్తరించనుంది విశాఖ రైల్వే జోన్ తో ఉత్తరాంధ్రకు కొత్త రూపు రానుంది. కొత్త రైలు సర్వీసులు ఇక్కడి నుంచి ప్రారంభం కానున్నాయి. వస్తు రవాణా కూడా పెరగనుంది. ప్రధానంగా స్థానికంగా పండే వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు మార్గం సుగమం కానుంది.

# ఏపీ బీజేపీకి ఏమైంది?

**నేతలు ఎవరికి వారే.. పార్టీ పెద్దల ఆగ్రహం**

(ఓకే తెలుగున్యూస్)

ఏపీలో బిజెపి ప్రక్షాళన దిశగా హై కమాండ్ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ పార్టీ నేతల వ్యవహార శైలిపై ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. పార్టీ అభివృద్ధిపై నేతలు పెద్దగా దృష్టి పెట్టడం లేదు. పైగా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు ఉన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. పార్టీని బలోపేతం చేయడం లేదు. దీనిపై హై కమాండ్ కు స్పష్టమైన సమాచారం ఉంది. అందుకే నేతల తీరుపై పెద్దలు ఆగ్రహంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓ ముఖ్యమైన నేతను పిలిచి గట్టిగానే క్లాసు పీకినట్లు తెలుస్తోంది. సదరు నాయకుడి ఎదుట నేతల పనితీరు, వ్యవహార శైలి బయట పెట్టినట్లు సమాచారం. అందుకే మొత్తం మార్పు దిశగా అడుగులు వేస్తామని హెచ్చరించినట్లు తెలుస్తోంది.

**సొంతంగా ఉనికి ఏది?**

ఏపీలో భారతీయ జనతా పార్టీ కనీసం సొంతంగా ఉనికి చాటుకునే పరిస్థితిలో లేదు. తెలుగుదేశం పార్టీతో కలిసిన సమయంలో మాత్రమే ఓట్లతో పాటు సీట్లు పెరుగుతున్నాయి. ఒంటరిగా పోరాటం చేస్తున్న ప్రతిసారి ఒక్క నియోజకవర్గంలో కూడా డిపాజిట్లు రావడం లేదు. 2014లో టిడిపి తో కలిసి పోటీ చేస్తే ఎమ్మెల్యే తో పాటు ఎంపీ స్థానాలను దక్కించుకుంది బిజెపి. మొన్నటి ఎన్నికల్లో పొత్తులో భాగంగా ఎనిమిది ఎమ్మెల్యేలతో పాటు రెండు పార్లమెంట్ స్థానాలు ఆ పార్టీకి దక్కాయి. అయితే ఇప్పుడు కూడా ఎంపీలతో పాటు ఎమ్మెల్యేలు ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారు. కనీసం పార్టీ కోసం పట్టించుకునే వారు కరువవుతున్నారు.



**త్వరలో స్థానిక ఎన్నికలు..**

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. మూడు పార్టీలు కలిసి వెళ్తాయి. కానీ క్షేత్రస్థాయిలో భారతీయ జనతా పార్టీకి బలం లేదు. ఆ బలం పెంచుకునే ప్రయత్నం కూడా జరగలేదు. జిల్లా కమిటీలు ఉన్నాయంటే ఉన్నాయి. కనీసం గ్రామస్థాయి కమిటీలు లేవు. మండల కమిటీలు కానరావు. నియోజకవర్గాలు ఇన్చార్జులు ఉన్న ఫలితం లేదు. వాస్తవానికి భారతీయ జనతా పార్టీ ఇతర రాష్ట్రాల్లో బూత్ లెవెల్ లో బలమైన కమిటీలు ఉంటాయి. కానీ ఏపీ విషయానికి వచ్చినప్పుడు అటువంటి పరిస్థితి లేదు. ఇలానే కొనసాగితే ఏపీ బీజేపీలో ప్రక్షాళనకు హైకమాండ్ ప్రయత్నించే అవకాశం ఉంది. కచ్చితంగా చాలా రకాల మార్పులకు ఆ పార్టీ పెద్దలు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో

**మాధవ్ పై అసంతృప్తి**

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితుడైన పివిఎన్ మాధవ్ పార్టీని అభివృద్ధి చేస్తారని హైకమాండ్ భావించింది. ఆయనపై చాలా రకాలుగా అంచనాలు పెట్టుకుంది. కానీ ఎందుకో ఆయన ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదు. ప్రారంభంలో హడావిడి చేశారు. తరువాత ప్రెస్ మీట్ లకే పరిమితం అవుతున్నారు. దీంతో పార్టీ శ్రేణులకు అందుబాటులో లేరన్న విమర్శలు ఉన్నాయి. పార్టీకి పెద్దదిక్కుగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. ఆయనకు ఢిల్లీలో పరపతి ఉంది. సీఎం చంద్రబాబు వద్ద గౌరవం ఉంది. అందుకే ఆయన కేంద్ర ప్రభుత్వపరంగా, రాష్ట్ర ప్రభుత్వపరంగా పనులు చేసుకుంటున్నారు. స్థానికంగా పార్టీ శ్రేణులకు అందుబాటులో లేరన్న విమర్శ ఉంది. దగ్గుబాటి పురందేశ్వరి పరిస్థితి కూడా అదే. మొన్నటి ఎన్నికల వరకు ఆమె బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలుగా ఉండేవారు. ఇప్పుడు రాజమండ్రి ఎంపీగా కూడా ఉన్నారు. కనీసం వారంలో ఒక్కరోజు కూడా ఆమె అందుబాటులో ఉండడం లేదు. ఆమె తరుపున కూడా ఎవరు లేకుండా పోయారు పార్లమెంట్ నియోజకవర్గంలో. ఇవన్నీ పార్టీ దృష్టికి వెళ్లాయి కూడా.. అందుకే హై కమాండ్ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

---

## డీఎస్సీ 2025పై

# వైసీపీ కుట్ర

### వస్తే 6 లక్షల కుటుంబాలు.. పోతే 16 వేల కుటుంబాలు

(ఓకే తెలుగున్యూస్)

వస్తే కొండ.. పోతే ఈక.. అన్నట్టు ఆలోచనతో ఉంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. మెగా డీఎస్సీ 2025 పై భారీగానే ప్లాన్ చేసింది ఆ పార్టీ. ఏడాది తరువాత అక్రమాలు జరిగాయి అంటూ ఆరోపణలు చేస్తోంది. కేవలం ఆరోపణలకు మాత్రమే పరిమితం అవుతోంది. ఎక్కడ న్యాయపోరాటం చేయడం లేదు. దీని వెనుక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్కా స్కెచ్ అర్థం అవుతోంది. కేవలం రాష్ట్రంలో లక్షలాది ఓట్లను టార్గెట్ చేసుకునే ఈ కొత్త ప్రచారానికి తెర తీసింది. పోతే వేల ఓట్లు.. వస్తే లక్షల కోట్లు అన్నట్టు ఆలోచన చేసింది. గట్టిగానే ప్రణాళిక వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తోంది. సాక్షి మీడియాలో వ్యతిరేక కథనాలు వడ్డిస్తోంది.

**మెగా డీఎస్సీ ప్రకటన..**

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ఫైల్ పై సంతకం చేశారు సీఎం చంద్రబాబు. నారా లోకేష్ నేతృత్వంలో డీఎస్సీ నియామక ప్రక్రియ గడువులోగా పూర్తి చేయగలిగారు. గత ఏడాది ఉపాధ్యాయులను నియమించారు. అయితే కూటమికి అదో ప్లస్ పాయింట్ గా మారింది. ఉపాధ్యాయ వర్గాల్లో కూడా సంతృప్తి కనిపిస్తోంది. అయితే ఇది అంత మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రుచించలేదు. అందుకే కొత్త ప్రణాళిక వేసింది. డీఎస్సీలో అక్రమాలు జరిగాయి అంటూ జగన్మోహన్ రెడ్డి ఆరోపణలు చేయడం ప్రారంభించారు. ఏదైనా నియామక ప్రక్రియ పై ఆరోపణలు వస్తే వెంటనే కోర్టుకు వెళ్లాలి. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అలా చేయలేదు. ఎందుకంటే డీఎస్సీలో ఎటువంటి అక్రమాలు జరగలేదు. ఆ విషయం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కూడా తెలుసు. బాధితుల పక్షాన న్యాయ పోరాటం చేయడం కంటే దీనిని రాజకీయం చేయడానికి ఎక్కువగా వాడుకుంటుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.




**ఒక్క పోస్ట్ భర్తీ చేయలే**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ఒక్క ఉపాధ్యాయ పోస్ట్ కూడా భర్తీ చేయలేదు. కనీసం అటువంటి ఆలోచన చేయలేదు. అధికారంలోకి వస్తే ఏటా మెగా డీఎస్సీ ప్రకటిస్తామని 2019 ఎన్నికల్లో హామీ ఇచ్చారు జగన్. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ శిక్షణ పొందిన లక్షలాదిమంది ఆశగా ఎదురు చూశారు. కానీ వారికి అవకాశం ఇవ్వలేదు జగన్. 2024 ఎన్నికలకు నెల రోజుల ముందు 6100 ఉపాధ్యాయ పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. ఇంతలోనే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో డీఎస్సీ రద్దయింది. దీంతో లక్షలాదిమందికి ఎదురుచూపులు మిగిలిపోయాయి.

**అభ్యర్థుల్లో గందరగోళం..**

దాదాపు ఆరు లక్షల మంది డిఎస్సీ పరీక్ష రాశారు. అందులో 16 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయి. కానీ అభ్యర్థుల్లో ఒక రకమైన గందరగోళం సృష్టించాలన్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆలోచన. పోతే 16,000 ఓట్లు.. వస్తే లక్షల ఓట్లు అన్నది ఆ పార్టీ ఆలోచన. ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగానికైనా రిజర్వేషన్లు అమలు చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కూడా తెలుసు. కుల రిజర్వేషన్లతో పాటు దివ్యాంగులకు కొన్ని పోస్టులు కేటాయించాలి. ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా అలానే చేసింది. నిన్ననే విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ పూర్తి క్లారిటీ ఇచ్చారు. సుదీర్ఘ వివరణ ఇచ్చారు. సాక్షి మీడియాలో డీఎస్సీ అక్రమాలంటూ వచ్చిన కేస్ స్టడీ పై కూడా స్పష్టతనిచ్చారు. అయితే ఇదంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తెలియనిది కాదు. డీఎస్సీ పై బురద జల్లి ప్రభుత్వానికి క్రెడిట్ రాకుండా చేయాలి. డీఎస్సీలో ఉద్యోగం రాని వారికి అనుమానం పెంచి వారిని తమ వైపునకు తిప్పుకోవాలి. అంతకుమించి ఏమీ కనిపించడం లేదు కూడా ఇందులో.



# రాష్ట్ర విభజనకు పుష్కరం




(ఓకే తెలుగున్యూస్)

## ఉభయ రాష్ట్రాలకూ ప్రయోజనం

**రాష్ట్ర విభజన జరిగి పుష్కరకాలం అవుతోంది. 2014 జూన్ 2న రాష్ట్ర విభజన అధికారికంగా జరిగింది. తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ విడిపోతుందని ఎవరు ఊహించలేదు. విడిపోతే రెండు రాష్ట్రాలు ఇబ్బందులు పడతాయి అన్న భావన ఎక్కువగా ఉండేది. కానీ 12 సంవత్సరాల తరువాత వెనక్కి తీసుకుంటే రెండు రాష్ట్రాలు అభివృద్ధి సాధించాయి. ఉమ్మడి రాష్ట్రపరంగా దక్షిణాది రాష్ట్రాల్లో వెనుకబాటు కనిపించినా.. రాష్ట్ర విభజన తరువాత తెలుగు రాష్ట్రాలు సత్తా చాటాయి. ఇక రాజకీయంగా సైతం తనదైన మార్కు చాటుకున్నాయి రెండు రాష్ట్రాలు. రెండు రాష్ట్రాల ప్రజలు రాజకీయంగా భిన్న వైఖరి ప్రదర్శించారు. అయినా సరే తన రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించారు.**

తెలంగాణకు విద్యుత్ సమస్యలు, ఆంధ్రకు ఆర్థిక సమస్యలు వెంటాడుతాయని ఎక్కువ మంది అంచనా వేశారు. కానీ ఆ సమస్యలన్నింటినీ రెండు రాష్ట్రాలు అధిగమించాయి అని చెప్పవచ్చు. ఉమ్మడి రాష్ట్రపరంగా వెనుకబాటు ఉన్నా.. విభజిత రాష్ట్రాలుగా మిగతా దక్షిణాది రాష్ట్రాలకు గట్టి పోటీ ఇచ్చాయి.

రాష్ట్ర విభజన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు అనుభవజ్ఞులకు ప్రాధాన్యమిచ్చారు. ఏపీలో చంద్రబాబు, తెలంగాణలో కెసిఆర్ కు ఛాన్స్ ఇచ్చారు. రాజధాని లేని ఏపీని చంద్రబాబు అయితేనే అభివృద్ధి చేయగలరని ప్రజలు ఆశించారు. తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కెసిఆర్ ను గుర్తించి.. అదే రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లగలరని భావించి అవకాశం కల్పించారు. అయితే ఏపీలో ఐదేళ్లకే అధికార మార్పిడి చేశారు. తెలంగాణలో మాత్రం కెసిఆర్ కు తొమ్మిదేళ్లపాటు అవకాశం కల్పించారు. మూడోసారి ఛాన్స్ ఇవ్వకపోగా.. ఏపీలో చంద్రబాబుకు మాత్రం రెండో ఛాన్స్ ఇచ్చి బ్యాలెన్స్ చేశారు.

ఏపీలో మధ్యలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారు ప్రజలు. తెలంగాణలో రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ ను గుర్తించి ఛాన్స్ కల్పించారు. ఇలా రాజకీయంగా కూడా బ్యాలెన్స్ చేశారు ఉభయ రాష్ట్రాల ప్రజలు.రెండు తెలుగు రాష్ట్రాల మధ్య పుష్కర కాలంలోనే అంతరం పోయింది. మళ్లీ పాత రోజులు మాదిరిగానే సోదర భావం పెరిగింది. పారిశ్రామికంగా తెలంగాణ అభివృద్ధి సాధించగా.. ఏపీ కూడా నవనిర్మాణ దిశ గా అడుగులు వేసింది. పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మధ్య కొన్ని రకాల విభజన సమస్యలు ఉండిపోయాయి. చంద్రబాబు, కెసిఆర్ సమయంలో జరగలేదు. కెసిఆర్ కు మిత్రుడైన జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా మోక్షం కలగలేదు. కానీ ఇటు చంద్రబాబు, అటు రేవంత్ వచ్చిన తర్వాత మాత్రం పురోగతి పెరిగింది. రాష్ట్ర విభజనతో ఏపీ ప్రజలు బాధపడ్డారు మొదట్లో. కానీ పుష్కరకాలం తర్వాత మాత్రం మంచిదే అన్న అభిప్రాయానికి వచ్చారు. తెలంగాణ ప్రజలు ప్రారంభంలో సంబరపడ్డారు. కానీ ఇప్పుడు ఉమ్మడిగా ఉంటేనే కొంత కలిసి వచ్చేదేమో అనే రీతిలో ఆలోచన చేస్తున్నారు. ప్రత్యేక తెలంగాణ సెంటిమెంట్ అనేది అక్కడి ప్రజల్లో తగ్గింది. ఆ సెంటిమెంట్తో రాజకీయాలు చేసిన పార్టీల హవా కూడా తగ్గింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలు ఇప్పుడు అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాయి. ప్రజల ఆకాంక్ష కూడా అదే.

# బాలివుడ్ సరే.. టాలివుడ్

### అమరావతి వైపు చూడని తెలుగు చిత్ర పరిశ్రమ

(ఓకే తెలుగున్యూస్)

అమరావతి రాజధాని నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. మొన్నటి వరకు ఏపీ రాజధాని ఏది అంటే చెప్పుకునే పరిస్థితిలో ప్రజలు ఉండేవారు కాదు. కానీ ఇప్పుడు మాత్రం సగర్వంగా చెప్పుకుంటున్నారు అమరావతి అని. అందుకు తగ్గట్టుగానే అమరావతి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అయితే అమరావతిలో 70 ప్రభుత్వ రంగ సంస్థలు నిర్మితం అవుతున్నాయి. అందులో బ్యాంకులు సైతం ఉన్నాయి. మరో నాలుగు వరకు ప్రైవేటు యూనివర్సిటీలు, ఆస్పత్రుల నిర్మాణం జరుగుతోంది. అయితే అమరావతి ఔన్నత్యాన్ని గుర్తించిన బాలీవుడ్ సంస్థలు అమరావతిలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. భవిష్యత్తులో దక్షిణాది రాష్ట్రాల్లో అమరావతి అద్భుత నగరంగా మారుతుందని అంచనా వేస్తున్నారు బాలీవుడ్ ప్రముఖులు. అందుకే సంజయ్ దత్ లాంటివారు అమరావతికి వచ్చి.. ప్రభుత్వంతో చర్చలు జరిపి తన ఆసక్తిని బయటపెట్టారు. దీనిపై చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ సైతం సానుకూలత చూపారు. అయితే ఆయన ఒక్కరే కాదు బాలీవుడ్ ప్రముఖ సంస్థలు అమరావతిలో తమకు భూములు కేటాయించాలని కోరుతూ దరఖాస్తులు చేసుకుంటున్నాయి. అయితే వాటికి భూముల కేటాయింపుకు సంబంధించి సానుకూల నిర్ణయాలు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

### మర్యాదపూర్వకంగా కలవలే..

అమరావతి ఔన్నత్యాన్ని బాలీవుడ్ గుర్తించింది కానీ.. టాలీవుడ్ మాత్రం గుర్తించడం లేదు. అసలు ఏపీనే టాలీవుడ్ లెక్కచేయడం లేదు. ఏపీ పాలకుల విషయంలో కూడా అలానే ఉంది చిత్ర పరిశ్రమ పరిస్థితి. ఏపీ సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలవాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పలుమార్లు సూచించారు. కానీ ఇంతవరకు తెలుగు చిత్ర ప్రముఖులు వచ్చి సీఎం చంద్రబాబును కలిసిన పరిస్థితి లేదు. కనీసం అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు కూడా ముందుకు రావడం లేదు తెలుగు చిత్ర పరిశ్రమ ప్రముఖులు.

### పెట్టుబడులు పెడితే మంచిది..

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మావిగన్ అంటూ పిచ్చి ప్రతిపాదన చేస్తోంది. దానిని పట్టించుకునే పరిస్థితి ఎవరికీ లేదు. పైగా ప్రజలు కూడా పెద్దగా ఆహ్వానించడం లేదు. అమరావతికి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కూడా కల్పించింది. దీనిని గుర్తించిన ఎక్కడో ఉన్న బాలీవుడ్ పరిశ్రమ అమరావతికి వచ్చేందుకు సిద్ధపడింది. కానీ ఇక్కడ వ్యాపారం చేసుకుని లాభాలు ఆర్జిస్తున్న టాలీవుడ్ మాత్రం అమరావతి ముఖం చూడడం లేదు. ఇది ఎంత మాత్రం సహేతుకం కాదు. అమరావతి విషయంలో ఇప్పటికైనా తెలుగు చిత్ర పరిశ్రమ ఒక నిర్ణయానికి రావాలి.

# వైసీపీ నేత భూ దోపిడీ



## డెయిరీ దిగ్గజం...నేడు కబ్జాపర్వం

(ఓకే తెలుగున్యూస్)

తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది గండిపేట భూముల వివాదం. ఏకంగా 1500 కోట్ల రూపాయల ప్రభుత్వ భూమిని కాజేయాలని స్కెచ్ వేసి అడ్డంగా బుక్కయ్యారు వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు. వినుకొండ ఎమ్మెల్యేగా వైసిపి హయాంలో ఐదేళ్ల పాటు కొనసాగారు. ఇప్పుడు ఏకంగా 12 ఎకరాల ప్రభుత్వ భూమిని.. అదే ప్రభుత్వ జీవోలను మార్చి కాజేయాలని చూశారు. భూమి ఆక్రమణ వరకు ఓకే... కానీ ప్రభుత్వ జీవోలను మార్చడం ఇప్పుడు సంచలనంగా మారింది. అప్పట్లో ఉన్న రెండు ప్రభుత్వాల సహకారంతోనే ఆయన ఈ బరితెగింపునకు పాల్పడి ఉంటారు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన తరువాతనే ఆయనలో ఈ కోణం బయటపడటం విశేషం.

### మంచి ట్రాక్ రికార్డు

బొల్లా బ్రహ్మనాయుడు అంటే డైరీ రంగంలో ది గ్రేట్ అన్నట్టు ఉండేది. శూన్యంలో ఉన్న తిరుమల డైరీ ని లాభాల బాట పట్టించిన ఘనత ఆయనది. ఆ డైరీలో తన వాటాలను విక్రయించి రెండు వేల కోట్ల రూపాయలు పొందారు. వందల కోట్ల వ్యాపారాలతో హాయిగా గడిచిపోతుంది ఆయన జీవితం. అటువంటిది హైదరాబాద్ శివారులలో గండిపేట వద్ద 12 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు. అంతటితో ఆగకుండా ప్రభుత్వ జీవోలను మార్చి.. తన భూమి అన్నట్టు చూపి అడ్డంగా బుక్కయ్యారు. ప్రస్తుతం ఆయన పరారీలో ఉన్నారు. అరెస్టు కాక తప్పదు కూడా.

### వైసీపీలో చేరిన తర్వాత..

ఒక మంచి పేరుతో పాటు పరపతిని సొంతం చేసుకున్నారు బ్రహ్మనాయుడు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాతనే ఆయనకు ఇటువంటి బుద్ధి పుట్టినట్టు ఉంది. ఎందుకంటే వ్యాపారంతో పాటు తన వ్యక్తిత్వాన్ని సైతం ఆయన కాపాడుకుంటూ వచ్చారు. కానీ అదే వ్యక్తిత్వాన్ని పణంగా పెట్టి.. గౌరవాన్ని ఇబ్బందుల్లో పెట్టుకుని కబ్జాలు, ఆక్రమణలతో చెడ్డ పేరు తెచ్చుకుంటున్నారు. అయితే ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో బొల్లా బ్రహ్మనాయుడు అంటే ఒక కబ్జాకోరుగా చూస్తున్నారు. ఐదేళ్లపాటు వినుకొండ వైయస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా కొనసాగారు. ఈ భూ వివాదంతో ఐదేళ్ల ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో వినుకొండలో చెరువులు, ప్రభుత్వ భూములను ఆక్రమించారన్న ఆరోపణలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి. మరింత మంది బాధితులు ముందుకు వచ్చే అవకాశం ఉంది.

# రేవంత్ రెడ్డి వర్సెస్ పవన్ కళ్యాణ్..

# తెలంగాణలో ఎందుకిలా..

**సాధారణంగా రాజకీయాలలో కొందరి మధ్య వైరం అనేది అంత ఈజీగా సాధ్యం కాదు. ఎందుకంటే వారి మధ్య అటువంటి వ్యవహారాలు ఎప్పుడూ చోటు చేసుకోవు కాబట్టి.. ప్రజలు ఆ విధంగా ఆలోచించరు. కానీ తెలంగాణలో అందుకు విరుద్ధమైన పరిస్థితులు చోటుచేసుకున్నాయి.. ఎవరు ఊహించని విధంగా.. కలలో కూడా అనుకోని విధంగా రాజకీయ వైరం ఏర్పడింది. అది కాస్త ఒక రకమైన సంచలనానికి దారితీసింది. ఇది ఎటువైపు వెళుతుంది.. దేని వైపు దారితీస్తుందో చూడాలి.**

**ప్రొఫెసర్ నాగేశ్వర్ మాటలకు తెలంగాణ వాదాన్ని జోడించిన కొందరు**

**జూన్ 2న నిర్వహించే జన సేన సభకు తెలంగాణ గవర్నమెంట్ నో**

**ప్రెస్ మీట్ పెట్టిన జనసేనాని..**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు**

**ఇదే అదునుగా రెచ్చిపోయిన కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు**

**తెలంగాణ ఆంధ్రా సెంటిమెంట్ రెచ్చగొట్టే ప్రయత్నాలు**

**విస్మయం వ్యక్తం చేస్తున్న రాజకీయ విశ్లేషకులు**



**ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడిన మాటల తర్వాత.. అది రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ సంచలనం సృష్టించిన తర్వాత.. ఈ ఎపిసోడ్లోకి కాంగ్రెస్ నాయకులు వచ్చేసారు. ఆ విశ్లేషకుడిని బాధిత పక్షం లాగా చూపించేందుకు ప్రయత్నాలు చేశారు.**

**ముందుగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్ ఈ వ్యవహారంలోకి ప్రవేశించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను హైదరాబాద్ ఖాళీ చేసి వెళ్లిపోవాలని.. డిమాండ్ చేశారు.**

**ఆ తర్వాత జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ ప్యాకేజి స్టార్ అంటూ మండిపడ్డారు.**

**ఇక టీఆర్ఎస్ అధినేత్రి పళ్లు రాలుతాయి అంటూ పవన్ కళ్యాణ్ మీద మండిపడ్డారు.**

**కాంగ్రెస్ మంత్రి పొన్నం ప్రభాకర్ పవన్ కళ్యాణ్ బిజెపి, బీఆర్ఎస్ కు అమ్ముడుపోయిన వ్యక్తి అని.. ఆయన ఒక ప్యాకెజి స్టార్ అంటూ ఆరోపించారు..**

ఈ పరిణామాల తర్వాత పవన్ కళ్యాణ్ స్పందించారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యలను పెద్దగా లెక్కలోకి తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఎప్పుడైతే హస్తం పార్టీ నాయకులు తనమీద విమర్శలు చేయడం మొదలుపెట్టారో ఆయన నేరుగా రంగంలోకి దిగారు. అంతేకాదు.. తెలంగాణలోని గచ్చిబౌలి ప్రాంతంలో సంధ్య కన్వెన్షన్ హాల్ లో అంతర్గత సమావేశం నిర్వహించుకుంటామని తెలంగాణ పోలీసులకు దరఖాస్తు





చేసుకున్నారు. అయితే ప్రభుత్వం చివరి నిమిషంలో పవన్ కళ్యాణ్ కు హ్యాండ్ ఇచ్చింది. దీనికి తెలంగాణ పోలీసులు చెప్పిన కారణమేంటంటే.. ప్రొఫెసర్ నాగేశ్వర్ మీద జనసేన నాయకులు విమర్శలు చేయడం ద్వారా.. తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతిన్నది.. తెలంగాణ ప్రజలు పవన్ కళ్యాణ్ మీద ఆగ్రహంగా ఉన్నారు.. అందువల్ల ఈ సమావేశానికి అనుమతి ఇచ్చేది లేదని స్పష్టం చేశారు.

ఈ నేపథ్యంలో జన సేన అధినేత తన గృహం నుంచి విలేకరుల సమావేశం నిర్వహించారు. చాలా ఆవేశంగా మాట్లాడారు. తాను ఇక్కడ పోటీ చేసే విషయం మీద స్పష్టత ఇచ్చారు. పోరాటల పురిటిగడ్డలో ఎందుకు సమావేశం నిర్వహిస్తున్న విషయం మీద కూడా క్లారిటీ ఇచ్చారు. జనసేన అధినేత మీద కవిత ఆరోపణలు చేస్తే ఒక రకంగా తీసుకోవచ్చు. ఎందుకంటే ఆమెకు ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకమైన గుర్తింపు కావాలి. అందువల్లే ఆమె అలా చేస్తుందనుకోవచ్చు. భారత రాష్ట్ర సమితి పవన్ కళ్యాణ్ మీద విమర్శలు చేస్తే.. దాన్ని కూడా ఒక రకంగా తీసుకోవచ్చు. ఎందుకంటే భారత రాష్ట్ర సమితికి ఆంధ్రా ప్రాంతం మీద.. అక్కడి రాజకీయ నాయకుల మీద విమర్శలు చేస్తేనే ఆ పార్టీకి మనుగడ. అదే గనుక లేకపోతే ఆ పార్టీకి తెలంగాణలో కొనసాగింపు ఉండదు.

**సెంటిమెంట్ రగిలితేనే ఓట్లు**

భారత రాష్ట్ర సమితి నుంచి కవిత వరకు ఏపీ డిప్యూటీ సీఎం మీద విమర్శలు చేశారంటే దాని వెనక ఒక అర్థం ఉంది. కానీ కాంగ్రెస్ నాయకులు ఈ స్థాయిలో జనసేన అధినేత మీద విమర్శలు చేయడం నిజంగా ఆశ్చర్యం. రేవంత్ రెడ్డి ఆదేశాల లేకుండా వారు ఇలా చేశారనుకోవడానికి లేదు. కానీ ఈ ఉద్దేశ్యాలు ఆశించి కాంగ్రెస్ పార్టీ ఇలాంటి విమర్శలు చేస్తుందో అర్థం కావడం లేదు..

**ఈ స్థాయిలో విమర్శలు**

త్వరలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికలు అన్ని పార్టీలకు అత్యంత ప్రతిష్టాత్మకం. అలాంటప్పుడు తెలంగాణ సెంటిమెంట్ రగిలితేనే ఓట్లు పడతాయని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అందువల్లే జనసేన అధినేత మీద ఈ స్థాయిలో విమర్శలు చేసినట్టు కనిపిస్తోంది. కానీ హైదరాబాదులో సెటిలర్ ఓటర్లు చాలా ఎక్కువగా ఉన్నారు. పవన్ కళ్యాణ్ మీద విమర్శలు చేస్తే..ఆంధ్రా వాదం మీద ఆరోపణలు చేస్తే అప్పుడు ఆ ఓట్లు వేరే పార్టీ వైపు వెళ్లే అవకాశం ఉంది.

**కాంగ్రెస్ ఎందుకు టార్గెట్ చేసినట్టు**

మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో పోటీ చేస్తానని జనసేనాని స్పష్టం చేశారు. అలాంటప్పుడు కాంగ్రెస్ ఎందుకు అతడిని టార్గెట్ చేసినట్టు..

**ఇలాంటి వైఖరి ఎందుకు**

కాంగ్రెస్ జాతీయ పార్టీ.. మన పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్లో కూడా రాజకీయాలు చేస్తోంది. అలాంటప్పుడు పవన్ కళ్యాణ్ విషయంలో రేవంత్ ఇలాంటి వైఖరి ఎందుకు తీసుకున్నారు.. భారత రాష్ట్ర సమితికి అవకాశం ఇవ్వకూడదనా.. పవన్ కళ్యాణ్ వస్తే భారత రాష్ట్ర సమితికి ప్రయోజనం దక్కుతుందనా.. ఈ ప్రశ్నలు రాజకీయ విశ్లేషకులు వేస్తున్నారు.. ఒకవేళ ఇదే విధానం కనుక రేవంత్ రెడ్డిది అయితే.. ఆయన ముందుగానే మేల్కొన్నట్టు..

**సెటిలర్ ఓటర్లు భారత రాష్ట్ర సమితి వైపు మొగ్గు**

కానీ, గత ఎన్నికల్లో సెటిలర్ ఓటర్లు భారత రాష్ట్ర సమితి వైపు మొగ్గు చూపించారు. ఇప్పుడు పవన్ కళ్యాణ్ విషయంలో రేవంత్ రెడ్డి కొనసాగించిన వైఖరి వల్ల వారి ఓట్లు ఎటువైపు వెళ్తాయో చూడాల్సి ఉంది. కాకపోతే ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్న వ్యాఖ్యల ద్వారా గోటితో పోయే వ్యవహారాన్ని ఇక్కడ దాకా తీసుకొచ్చారు. రెండు రాష్ట్రాల మధ్య వివాదంగా మార్చారు. అయితే ఇది ఎక్కడదాకా దారి తీస్తుందో చూడాల్సి ఉంది.

## అదీ పవన్ కళ్యాణ్ అంటే..

# వైసీపీకి మాములు స్ట్రోక్ ఇవ్వలేదుగా..



ఇప్పుడంటే జగన్ గులాబీ పార్టీకి దగ్గర మిత్రుడు అయిపోయాడు. 2024లో జరిగే ఎన్నికల్లో ఏపీలో జగన్ మళ్ళీ అధికారంలోకి వస్తారని కెసిఆర్ కూడా చెప్పారు. అక్కడిదాకా ఎందుకు జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తుంటే ఆ కార్యక్రమానికి కేసీఆర్ కూడా వెళ్లారు. ఆయనను ప్రగతి భవన్ కు ఆహ్వానించారు. అప్పట్లో కాలేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రారంభానికి జగన్ ను కెసిఆర్ ఆహ్వానించారు. జగన్ మీడియాలో కేసీఆర్ గురించి.. కెసిఆర్ మీడియాలో జగన్ గురించి ఒక్క నెగిటివ్ వార్త కూడా రాదు. పైగా ఆ మధ్య బెంగళూరులో కేటీఆర్.. జగన్ ఓ ప్రైవేట్ కార్యక్రమంలో కలుసుకున్నారు. ఇద్దరు చాలాసేపు మాట్లాడుకున్నారు. సోషల్ మీడియాలో కూడా గులాబీ పార్టీకి వైసిపి.. వైసీపీకి గులాబీ పార్టీ సోషల్ మీడియా హ్యాండిల్స్ సహకరిస్తుంటాయి. పైగా ఒకరి ఫీడ్ మరొకరు షేర్ చేసుకుంటారు. సయామి కవలల మాదిరిగా సాగిపోతున్న గులాబీ పార్టీ, వైసిపి బంధానికి పవన్ కళ్యాణ్ తెలంగాణ గడ్డ మీద నుంచి గట్టి షాక్ ఇచ్చారు.

పవన్ కళ్యాణ్ ను ఆంధ్ర నేత అంటూ నమస్తే తెలంగాణ ఒక కథనాన్ని మంగళవారం పబ్లిష్ చేసింది. ఈ నేపథ్యంలో కొంతమంది ఔత్సాహికులు పవన్ కళ్యాణ్.. కేటీఆర్ గతంలో దిగిన ఫోటోలను.. వారిద్దరూ మాట్లాడుకుంటున్న వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో గులాబీ పార్టీ మీడియా అసలు రంగు బయటపడింది. ఇక పవన్ కళ్యాణ్ తన ఇంటి వద్ద నుంచి జరిగిన విలేకరుల సమావేశంలో ఆవేశంగా మాట్లాడారు. ముఖ్యంగా తెలంగాణ విషయంలో వైఎస్ఆర్ పోషించిన పాత్ర గురించి స్పష్టంగా చెప్పేశారు. ఈ మధ్య కాలంలో వైఎస్ఆర్ గురించి గులాబీ మీడియా.. గులాబీ పార్టీ నాయకులు సానుకూలంగా మాట్లాడుతున్నారు. అంతకుముందు కేసీఆర్ కూడా వైఎస్ఆర్ గురించి గొప్పగానే మాట్లాడారు. తెలంగాణకు బద్ధ శత్రువు వైఎస్ఆర్ అన్నట్టుగా పవన్ కళ్యాణ్ మాట్లాడారు.

వైయస్ బతికున్నప్పుడు చాలామంది తెలంగాణవాదులు నోరు మెదపలేదని.. నాడు తెలంగాణని వ్యతిరేకించిన వాళ్లంతా ఇప్పుడు పదవుల్లో ఉన్నారని.. వైయస్సార్ బతికి ఉన్నప్పుడు వారంతా తెలంగాణ నినాదాన్ని కూడా సహించేవారు కాదని పవన్ కళ్యాణ్ చెప్పారు. దీంతో పవన్ కళ్యాణ్ మీద విష ప్రచారం చేస్తున్న వైసీపీకి.. వైసిపి మీడియాకు జనసేన అధినేత షాకిచ్చారు. తెలంగాణ ఉద్యమం సాగుతున్నప్పుడు వైయస్సార్ ఎలా వ్యవహరించారు.. ఎలా ఉద్యమాన్ని తొక్కిపెట్టారు అనే విషయాన్ని కూడా పవన్ కళ్యాణ్ గట్టిగానే ఉదహరించారు.. దీంతో వైసీపీ నేతలకు షాక్ తగిలింది. అంతేకాదు ఇటీవల ఓ వైసీపీ ఎమ్మెల్యే చేసిన భూ కుంభకోణం కూడా వెలుగులోకి వచ్చింది. దీంతో ఏదో హంగామా చేద్దామని అనుకున్న వైసీపీ మీడియాకు.. వైసిపి నాయకులకు ఆదిలోనే బ్రేక్ వేశారు పవన్ కళ్యాణ్. అదే కాదు తెలంగాణ సెంటిమెంట్ రగిలించే ప్రయత్నం చేస్తున్న నమస్తే తెలంగాణకు కూడా దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు పవన్ కళ్యాణ్.

**టీమ్ ఇండియా టి20 కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ కు ఉద్వాసన పలుకుతున్నారా.. అతడి స్థానంలో వేరే ఆటగాడికి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించబోతున్నారా.. మేనేజ్మెంట్ ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేసిందా.. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన మాత్రమే మిగిలి ఉందా.. ఈ ప్రశ్నలకు అవును అని సమాధానం చెబుతున్నారు క్రికెట్ విశ్లేషకులు. ఎందుకంటే కేవలం రెండు రోజుల్లోనే టీమిండియా టి20 కెప్టెన్ విషయంలో ఒక కీలక ప్రకటన వస్తుందని వారు వివరిస్తున్నారు.**



# సూర్య ఔట్.. టీమిండియాకు కొత్త కెప్టెన్

» రేసులో సంజూ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ
» కోచ్ గౌతమ్ గంభీర్, సెలక్టర్ల మధ్య కొలిక్కిరాని చర్చలు
» వైభవ్ సూర్యవంశీ ఎంట్రీకి లైన్ క్లియర్..
» ఐర్లాండ్ సిరీస్ తో జాతీయ జట్టులోకి ప్రవేశం







టీమిండియా తదుపరి ఐర్లాండ్, ఇంగ్లాండ్ జట్లతో టి20 సిరీస్ మాత్రమే కాకుండా ఆసియా గేమ్స్ లో కూడా రంగంలోకి దిగుతోంది. ఈ నేపథ్యంలో ఈ మూడు సిరీస్లలో ఆడే జట్టు వివరాలను మేనేజ్మెంట్ ప్రకటించబోతోంది. టి20 జట్టును సూర్య కుమార్ యాదవ్ మెరుగ్గా ముందుకు నడిపించాడు. అతని నాయకత్వంలో టీమిండియా ఒక్క సిరీస్ కూడా కోల్పోలేదు. అయితే ఆటగాడిగా అతడు అంతగా ప్రభావం చూపించలేదు. అయితే భవిష్యత్తు లక్ష్యాలు వేరే విధంగా ఉండడంతో మేనేజ్మెంట్ కొత్త సారధివైపు దృష్టి సారిస్తున్నట్టు తెలుస్తోంది.

**కొత్త సారథిగా అతడే**

టి20 ప్రపంచ కప్ లో భారత జట్టును సూర్య కుమార్ యాదవ్ ముందుకు నడిపించాడు. ఏకంగా వరల్డ్ కప్ అందించాడు. ఐపీఎల్ లో ముంబై జట్టు తరఫున ఆడాడు. కానీ స్థిరమైన ఆట తీరు కొనసాగించడం విఫలమయ్యాడు. 2028లో టి20 ప్రపంచ కప్.. లాస్ ఏంజిల్స్ వేదికగా ఒలంపిక్స్ జరుగుతాయి.. ఈ టోర్నీల కోసం జట్టును సిద్ధం చేయాలని మేనేజ్మెంట్ భావిస్తోంది. కొత్త సారథిగా పంజాబ్ జట్టు కెప్టెన్ అయ్యర్ కు అవకాశం కల్పిస్తారని ప్రచారం జరిగింది. అయితే అతడు మాత్రమే కాకుండా తెలుగు కుర్రాడు తిలక్ వర్మ కూడా జాబితాలో ఉన్నట్టు తెలుస్తోంది. సంజు శాంసన్, ఇషాన్ కిషన్ వంటి వారు కూడా కెప్టెన్ రేసులో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ప్రధాన కోచ్ గంభీర్, సెలెక్టర్ల మధ్య కెప్టెన్ విషయంలో ఒక స్థిరమైన అభిప్రాయం రాలేదని సమాచారం.

**ఆసియా క్రీడలకు సంబంధించి**

ఆసియా క్రీడలకు సంబంధించి ఇప్పటికే కొంతమంది ప్లేయర్లను బీసీసీఐ ప్రకటించింది. అందులో సూర్యకుమార్ యాదవ్, గిల్ కు అవకాశం లభించలేదు. వెస్టిండీస్ జట్టుతో జరిగే సిరీస్, 2028లో జరిగే ఒలంపిక్ గేమ్స్, టి20 వరల్డ్ కప్ వంటి టోర్నీలు ఉన్న నేపథ్యంలో.. సూర్య కుమార్ యాదవ్ ను ఆసియా గేమ్స్ కు ఎంపిక చేయలేదని తెలుస్తోంది.

**కొత్త కెప్టెన్ ను ఇప్పుడు నియమిస్తే**

ఒకవేళ కొత్త కెప్టెన్ ను ఇప్పుడు నియమిస్తే కేవలం ఐర్లాండ్, ఇంగ్లాండ్ జట్లతో జరిగే సిరీస్ లకు మాత్రమేనా.. భవిష్యత్తు టోర్నీలకు కూడా ఉంటుందా అనే ప్రశ్నకు త్వరలోనే సమాధానం లభించబోతుంది. ఆసియా క్రీడల కోసం పంపే భారత జట్టులో సీనియర్లు ఆడబోరని ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. ఇంగ్లాండ్ జట్టుతో జరిగే పొట్టి సిరీస్ కు మాత్రమే పూర్తిస్థాయిలో జట్టు వెళ్తుంది. అదే సూర్య స్థానాన్ని భర్తీ చేసే ఆటగాడు ఎవరో త్వరలో తేలిపోతుంది.

**టీమిండియా షెడ్యూల్ ఇదీ**

టీమిండియా ఈనెల 26 నుంచి 25 వరకు ఐర్లాండ్ జట్టుతో రెండు టీ20 లను ఆడుతుంది.

వచ్చేనెల 1వ తేదీ నుంచి 19 వరకు ఇంగ్లాండ్ లో ఇండియా పర్యటిస్తోంది. ఐదు టి 20 మ్యాచ్లు ఆడుతుంది.

వచ్చేనెల 23 నుంచి 26 వరకు జింబాబ్వే తో మూడు టి20 మ్యాచ్ల సిరీస్ ఆడుతుంది.

సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్ వేదికగా ఆసియా గేమ్స్ జరుగుతాయి. ఇందులో టీమ్ ఇండియా ఆడుతుంది.



## సూర్య వంశీకి చోటు

సూర్య కుమార్ యాదవ్ విషయాన్ని కాస్త పక్కన పెడితే ఐర్లాండ్, ఇంగ్లాండ్ సిరీస్ లలో టి20 జట్టులో సూర్య వంశీకి చోటు లభించే అవకాశం ఎక్కువ కనిపిస్తోంది.. సూర్య వంశీ ఐపీఎల్ లో అదరగొట్టాడు. అన్ని వ్యక్తిగత ట్రోఫీలను సొంతం చేసుకున్నాడు. అతడికి ఈ సిరీస్లలో అవకాశం ఇవ్వాలని చాలామంది కోరుతున్నారు. బీసీసీఐ కూడా సానుకూల ధోరణితో ఉన్నట్టు తెలుస్తోంది. ఒకవేళ అతడు గనుక అంతర్జాతీయ క్రికెట్ లోకి ప్రవేశిస్తే సచిన్ రికార్డును బ్రేక్ చేయడం పెద్ద కష్టమేమీ కాదు.

## వైభవ్ సూర్యవంశీకి అన్ని కోట్లు

# ఇవ్వడంలో అర్థముంది

**బీహార్ లో సాదాసీదాగా అతడి ఇల్లు సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి**
**సింప్లిసిటీకి ఫిదా అవుతున్న నెటిజన్లు బుడ్డోడి ఆట తీరు పట్ల ప్రశంసలే ప్రశంసలు**

15 సంవత్సరాల వయసులో ఒక బాలుడు ఈ స్థాయిలో ఐపీఎల్ మీద తన ముద్ర వేస్తాడని ఎవరు కూడా కలలో ఊహించరు. ఎందుకంటే ప్రపంచ స్థాయి బౌలర్ల బౌలింగ్లో ఆ స్థాయిలో పరుగులు చేయడం అంత ఈజీ కాదు. కానీ సూర్య వంశీ దానిని చేసి చూపించాడు. అంతేకాదు, పరుగుల వరద ఎలా పారించాలో లైవ్లో చూపించాడు.

వైభవ్ సూర్య వంశీ ఐపీఎల్లో ఆరెంజ్ క్యాప్ నుంచి మొదలు పెడితే ఎమర్జింగ్ ప్లేయర్ వరకు అన్ని అవార్డులు సొంతం చేసుకున్నాడు. దీని ద్వారా కోట్ల డబ్బు సంపాదించాడు. దీంతో చాలామంది సూర్య వంశీ గొప్ప గొప్ప భవనాలు కడుతున్నాడు.. భారీగా ఎదిగిపోయాడు అనుకుంటున్నారు. కానీ సూర్య వంశీ ఉంటున్న ఇల్లు అత్యంత సాదాసీదాగా ఉంది. ఐపీఎల్ లో అతడు సత్తా చూపించిన తర్వాత.. సొంత రాష్ట్రమైన బీహార్ వెళ్ళిపోయాడు. బీహార్ రాష్ట్రంలోని సమస్తిపూర్ జిల్లా తాజాపూర్ లో అతడికి సొంత ఇల్లు ఉంది. ఐపీఎల్ తర్వాత అతడు సొంత ఇంటికి రావడంతో స్థానికులు అతడిని చూసేందుకు వెళ్లారు. అతడితో ఫోటోలు దిగారు. రాజకీయ నాయకుల నుంచి మొదలుపెడితే క్రికెటర్ల వరకు ఈ జాబితాలో ఉన్నారు. అయితే వారు దిగిన ఫోటోలలో సూర్య వంశీ ఇల్లు అత్యంత సాధారణంగా ఉంది. ఆధర్ కూడా మామూలు డ్రెస్ లోనే కనిపించాడు. దీంతో సోషల్ మీడియాలో రకరకాల కామెంట్లు వినిపిస్తున్నాయి.

సూర్య వంశీ కి రాజస్థాన్ యాజమాన్యం ఆ స్థాయిలో డబ్బు ఇవ్వాల్సిందనని వారు చెబుతున్నారు. సూర్య వంశీది మామూలు



కుటుంబమని.. అతడు గొప్పగా ఆడటం వల్ల రాజస్థాన్ జట్టు విలువ పెరిగిందని.. రేటింగ్స్ కూడా అధికంగా వచ్చాయని.. అలాంటప్పుడు అతడికి కృతజ్ఞతగా రాజస్థాన్ యాజమాన్యం ఉండాలని అభిమానులు పేర్కొంటున్నారు. మరోవైపు అభిమానులను కలిసిన తర్వాత సూర్య వంశీ బెంగళూరు వెళ్ళిపోయాడు. అతడు నేషనల్ క్రికెట్ అకాడమీలో ట్రైనింగ్ తీసుకుంటాడని తెలుస్తోంది.

# ఆకాశంలో ఎర్రటి మెరుపులు

## అచ్చం యుగాంతం సినిమా లాగే



**ఉన్నట్టుండి ఆకాశం ఒక్కసారిగా మారిపోతూ ఉంటుంది. భయంకరమైన మేఘాలు ఆవరిస్తాయి. ఉరుములు గర్జన చేస్తూ ఉంటాయి. రకరకాల రంగులలో కనిపిస్తూ ఉంటాయి. ఆ తర్వాత వర్షం మొదలవుతుంది.. ఏకధాటిగా కురుస్తూనే ఉంటుంది. సముద్రాలు పోటెత్తుతూ ఉంటాయి. వరద నీరు ముంచెత్తుతూ ఉంటుంది. చూస్తుండగానే ఊర్లకు ఊర్లు నీళ్లలో కలిసిపోతూ ఉంటాయి. మొత్తంగా ప్రపంచమే మునిగిపోతూ ఉంటుంది.** చదువుతుంటే భయమేస్తోంది కదూ. అదేంటి యుగాంతం స్టోరీని చెబుతున్నారు అనుకుంటున్నారు కదా.. ఈ స్థాయిలో కాకపోయినా ఇలాంటి సంఘటనే ఇప్పుడు చోటుచేసుకుంది. అది కాస్త ప్రపంచ వ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. ఆసియా ప్రాంతంలో చైనాకు దగ్గరగా ఉన్న టిబెట్ ప్రాంతంలో ఇటీవల వర్షాలు కురిసాయి. వర్షాలు కురవడం పెద్ద విషయం కాకపోయినప్పటికీ అక్కడ ఆకాశంలో చోటు చేసుకున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వర్షాలు కురుస్తున్నప్పుడు ఆకాశంలో ఎర్రటి మెరుపులు కనువిందు చేశాయి. దానికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనం కలిగిస్తోంది. వీటిని రెడ్ స్ప్రైట్స్ అని పిలుస్తుంటారు. ఇలాంటి మెరుపుల వల్ల వాతావరణం మొత్తం భయానకంగా మారిపోతూ ఉంటుంది. పైగా ఇవి భూమి ఉపరితలానికి దాదాపు 50 నుంచి 90 కిలోమీటర్ల ఎత్తులో ఉంటాయి. ప్రదేశాలలో ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. ఇటువంటి పరిస్థితిని ట్రాన్సియంట్ లూమినస్ అని పిలుస్తుంటారు. విద్యుత్, నైట్రోజన్ అణువులు వెంటనే రియాక్ట్ అయి ఇలాంటి ఎరుపు రంగు లో మెరుపులు రావడానికి కారణం అవుతూ ఉంటాయి.

**వర్షాలు కురుస్తున్నప్పుడు**

సాధారణంగా వర్షాలు కురుస్తున్నప్పుడు మెరుపులు ఏర్పడటం సర్వసాధారణం. పైగా అవి తెలుపు రంగులో ఉంటాయి. మెరుపులు కూడా క్షణకాలంలోనే ఏర్పడి మాయమవుతుంటాయి. కొన్ని సందర్భాలలో మేఘాలు పరస్పరం రాపిడి చేసుకున్నప్పుడు మెరుపుల తీవ్రత అధికంగా ఉంటుంది. ఆ సమయంలో ఉరుములు కూడా అధికంగా ఉంటాయి. మెరుపులు ఎరుపు రంగులో ఉండడం వెనుక ప్రత్యేకమైన పరిస్థితులు ఉన్నప్పటికీ.. కొండ ప్రాంతమైన టిబెట్ లో ఇవి ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే ప్రపంచంలో అనేక రకాలుగా వాతావరణంలో మార్పులు కనిపిస్తున్నాయి. పసిఫిక్ మహాసముద్రం ఉపరితలం విపరీతంగా వేడెక్కుతోంది. దీనివల్ల మన దేశానికి వచ్చే నైరుతి రుతుపవనాల గమనం లో అనేక రకాల మార్పులు చోటు చేసుకుంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనిని సూపర్ ఎల్ నీనో అని పిలుస్తున్నారు. దీనివల్ల వర్షాలు సరిగా కురువకపోవడం.. కరువు కాటకాలు ఏర్పడే ప్రమాదం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. మనదేశంలో ఇలా ఉంటే.. ఇక ప్రపంచంలో మిగతా దేశాలలో ఆకస్మిక వర్షాలు.. వంటివి చోటు చేసుకుంటున్నాయి. యుగాంతం మాదిరి పరిస్థితి కాకపోయినప్పటికీ.. జాగ్రత్తగా ఉండాలని ప్రకృతి చెబుతోంది.

---

# వారానికి వెయ్యి మాత్రమే..

## ఇది మీ జీవితాన్ని ఎలా మార్చేస్తుందంటే..

**నెలకు లక్షల్లో వస్తుంది జీతం.. నెల తిరిగేసరికి జేబులో రూపాయి ఉండడం లేదు.. కొన్ని సందర్భాల్లో స్నేహితులను అప్పు అడగాల్సి వస్తోంది.. ఖర్చులకు విపరీతంగా పెరిగిపోయాయి. వేటికి కళ్లెం వేసే పరిస్థితి లేకుండా పోయింది. ఏం చేయాలో అర్థం కావడం లేదు.. ఈఎంఐలు కడుతున్నాను.. క్రెడిట్ కార్డు అప్పులు చెల్లిస్తున్నాను. అయినప్పటికీ ఆర్థికంగా సమస్యలు తప్పడం లేదు..**



ఈ బాధ ప్రతి పదిమందిలో 8 మందికి ఉంటుందంటే అతిశయోక్తి కాదు. సంపాదన పెరిగినట్టుగానే ఖర్చులు కూడా విపరీతం కావడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఈ క్రమంలోనే చాలామంది అప్పులు చేస్తున్నారు. ఆర్థికంగా వెసులుబాటు సాధించడానికి రకరకాల మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇలాంటప్పుడే ఈ చిట్కాను పాటిస్తే ఆర్థికంగా ఇబ్బందులను సులభంగా ఎదుర్కోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

సాధారణంగా వారాంతంలో ఒక సినిమా చూసేందుకు.. రెస్టారెంట్ వెళ్లేందుకు.. తక్కువలో తక్కువ 1000 వరకు ఖర్చవుతుంది. వారాంతంలో ఏ మనిషి అయినా సరే కాస్త ఆట విడుపు కోరుకోవడం సహజం. అయితే అటువంటి వాటిని సాధ్యమైనంతవరకు ఖర్చు లేకుండా ఆస్వాదించే మార్గం చూసుకోవాలి.. ఆ వెయ్యి రూపాయలను అలా దాచి పెడుతూ ఉండాలి. వారానికి వెయ్యి రూపాయల చొప్పున దాచుకుంటే.. నెలకు ఏకంగా నాలుగువేల దాకా మిగులుతాయి. సంవత్సరానికి అది 48 వేల దాకా అవుతుంది. వాటిని అత్యవసరమైన నిధిగా వాడుకోవచ్చు. నెలకు కొంత ఎస్ఐపి లేదా ఆర్డీలో ఇన్వెస్ట్ చేయవచ్చు. ఎస్ఐపిలో ఇన్వెస్ట్మెంట్ గనుక చేస్తే దీర్ఘకాలంలో లాభాలు ఎక్కువగా వస్తూ ఉంటాయి. ఆర్థికంగా కష్టాలు అందరికీ ఉంటాయి. కాకపోతే వాటిని సానుకూల ధోరణిలో పరిష్కరించుకునే మార్గాలను అన్వేషించుకోవాలి. ఈ కథనంలో చెప్పినట్టు కాకుండా.. ఇంకా వేరే విధంగా కూడా పొదుపు సాగించవచ్చు. తద్వారా ఆర్థికంగా ఒత్తిడి ఎదుర్కోవాల్సిన అవసరం ఉండదు. అప్పులు చేయాల్సిన అగత్యం అంతకంటే ఉండదు. ఎందుకంటే అప్పు ఎప్పటికైనా ముప్పే. సాధ్యమైనంత వరకు అప్పు లేకుండా.. చూసుకోవాలి. అనవసరమైన ఖర్చులను పూర్తిగా తగ్గించుకోవాలి. ఆడంబరాలకు దూరంగా ఉండాలి. బడ్జెట్ పరిధిలోనే పూర్తయ్యేలా చూసుకోవాలి. అలాగని గిరిగీసి బతకాలని చెప్పడం లేదు.



---

# జపనీస్ వాకింగ్.. ఎన్ని ప్రయోజనాలో..



మనలో చాలామందికి ఉదయం పూట వాకింగ్ చేసే అలవాటు ఉంటుంది. సిటీలో ఉన్నవాళ్లు గ్రౌండ్లలో.. మారుమూల గ్రామాలలో ఉన్నవారు పంట పొలాలు లేదా.. ఇతర ప్రాంతాలలో వాకింగ్ చేస్తూ ఉంటారు. వాకింగ్ చేయడం వల్ల శారీరక సామర్థ్యం పెరుగుతూ ఉంటుంది. అంతేకాదు చెమట రూపంలో చెడు పదార్థాలు బయటికి వెళ్లిపోతుంటాయి. శరీరం స్లిమ్ అవుతూ ఉంటుంది. పైగా నడక వల్ల వృద్ధాప్య ఛాయలు రావు. శరీరంలో ఉన్న అనవసరమైన కొవ్వులు కూడా కరిగిపోతాయి. అవయవాల పనితీరు మెరుగవుతుంది.

వాకింగ్ చేసేటప్పుడు చాలామంది ఒక రకమైన విధానాన్ని పాటిస్తూ ఉంటారు. అయితే వాకింగ్ లు కూడా రకరకాల పద్ధతులు అమల్లోకి వచ్చాయి. అయితే ఇప్పటి కాలంలో జపనీస్ వాకింగ్ స్టైల్ ప్రపంచ వ్యాప్తంగా చర్చకు దారి తీస్తోంది. జపాన్ ప్రజలు పొదుపు.. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉంటారు.

జపాన్ ప్రజలు ప్రతిరోజు పదివేల అడుగుల వరకు నడుస్తూ ఉంటారు. దీనివల్ల శారీరక శ్రమ ఏర్పడుతూ ఉంటుంది. ఇది అత్యంత సులువైన శారీరక శ్రమకు బెంచ్ మార్క్ గా ఉంటుంది.. ఫిట్నెస్ ట్రాకర్స్ .. స్మార్ట్ ఫోన్ల సహాయంతో జపాన్ ప్రజలు ప్రతిరోజు 10,000 అడుగులు నడుస్తుంటారు.

ఇలా వాకింగ్ చేయడం వల్ల డిమెన్షియా నుంచి శరీరానికి రక్షణ కలుగుతుందని జపాన్ ప్రజలు నమ్ముతుంటారు. అయితే ఆరోగ్యంగా ఉన్న వారికి పదివేల అడుగుల దూరం నడవడం పెద్ద కష్టం కాకపోవచ్చు కానీ.. మోకాళ్ల నొప్పులు.. కీళ్ల నొప్పులు ఉన్నవారికి ఇబ్బంది తప్పకపోవచ్చు.. నడక వల్ల అనారోగ్య సమస్యలు దూరమవుతాయని జపాన్ ప్రజలు నమ్ముతుంటారు.. కొద్దిసేపు వేగంగా నడిచి.. ఆ తర్వాత నెమ్మదిగా నడవడం వల్ల శ్వాస మెరుగ్గా ఉంటుంది. అవయవాల పనితీరును మెరుగుపరుస్తుంది. రక్తప్రసరణ వ్యవస్థని కూడా సక్రమంగా చేస్తోంది. జపాన్ ప్రజలు టెక్నాలజీని ఎక్కువగా వాడుతూ ఉంటారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద నెమ్మదిగా నడుస్తుంటారు. ఆఫీస్ కు వెళ్తున్నప్పుడు వేగంగా అడుగులు వేస్తుంటారు.

ఉదయం బ్రేక్ ఫాస్ట్ తీసుకున్న తర్వాత కూడా జపాన్ ప్రజలు నడుస్తుంటారు. దీనివల్ల శరీరంలో జీర్ణక్రియ మెరుగవుతుందని.. సరైన స్థాయిలో పోషకాలు అన్ని శరీర అవయవాలకు లభిస్తాయని జపాన్ ప్రజలు నమ్ముతుంటారు. జపాన్ ప్రజలు ఉదయం పూట 30 నిమిషాల పాటు వాకింగ్ చేస్తుంటారు. ఒకవేళ ఆరోగ్యం మెరుగ్గా ఉన్నవారు అంతకంటే ఎక్కువగానే చేస్తుంటారు. ఇందులో మొదటి మూడు నిమిషాలు వేగంగా నడుస్తుంటారు. ఆ తర్వాత మూడు నిమిషాలు నెమ్మదిగా నడుస్తుంటారు. ఇలా ఐదుసార్లు వేగంగా.. ఐదుసార్లు నెమ్మదిగా నడిచి.. ఆరోగ్యానికి కాపాడుకుంటారు. అయితే ఇలా నడిచే మందు జపాన్ ప్రజలు వార్మప్ చేస్తుంటారు.

ఈ విధానం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని హార్వర్డ్ వైద్య నిపుణులు తమ పరిశోధన ద్వారా బయటపెట్టారు.

# మూవీ రివ్యూ : పెద్ది.. ఉప్పెన తర్వాత చద్ది!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ రంగస్థలం సినిమా తర్వాత పక్కా పల్లెటూరి ఊరమాస్ లుక్‌లో కనిపిస్తూ ఉండడంతో ఈ సినిమా పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. పైగా ఇది'ఉప్పెన' దర్శకుడు బుచ్చిబాబు సానా కావడంతో'పెద్ది' సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. స్పోర్ట్స్ డ్రామాగా, భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణం, జాన్వి కపూర్ లాంటి ప్యాన్ ఇండియా హీరోయిన్, ఏఆర్ రెహమాన్ లాంటి లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్.. ఇలా చెప్పుకుంటూ పోతే అన్నీ పెద్ద అన్నట్టుండే ఈ కాంబినేషన్ ప్రేక్షకులలో ఆసక్తిని పెంచడం పెద్ద విషయమేమీ కాదు. ఇలాంటి స్పెషాలిటీస్ ఉన్న ఈ సినిమా చరణ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచిందా? బుచ్చిబాబు తన రెండో సినిమాతో ప్రేక్షకులను మెప్పించాడా? చరణ్ లాంటి స్టార్ హీరోను ఒక హై బడ్జెట్ కమర్షియల్ ఎంటర్టైనర్ లో ప్రేక్షకుల అభిరుచులకు తగ్గట్టు ప్రెజెంట్ చేయగలిగాడా అనేది మనం రివ్యూ లో చూద్దాం.

గ్రామీణ నేపథ్యంలో సాగే పక్కా లోకల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా అనే ఫీల్ ఇస్తూనే మెల్లిగా నేషనల్ లెవెల్, ఇంటర్నేషనల్ లెవెల్ పోటీల వరకూ తీసుకెళ్ళే సినిమా ఇది. కొండ కింద ఊరు అనే ప్రభుత్వం అస్సలే గుర్తించని ఊరిలో, ప్రజలకు ఐడెంటిటీ అంటూ ఏమీ లేని ప్రజలు ఉండే ఊరిలో పెద్ది (రామ్ చరణ్) క్రికెట్ ఆటలో ఒక కూలీ. అయితే కూలి పనులు చేసుకుంటూనే క్రికెట్ ఆటలో ప్రతిభ కనబరుస్తూ ఉంటాడు. తన ప్రతిభతో విజయనగరం, బొబ్బిలి టీమ్ ల మధ్యలో క్రికెట్ పోటీలు జరిగినప్పుడు ఆట కూలీగా అవతారం ఎత్తుతాడు. అంటే ఎవరు వేలం పాట పాడుకుంటే వారి టీమ్ లో ఆడి ఆ జట్టును గెలిపించే ఒక యువకుడు. ఇలా కొంత కాలం జరిగిన తర్వాత కొన్ని కారణాల వల్ల అవమానాల పాలు కావలసి వస్తుంది. అప్పుడు కూలీ కోసం అట ఆడకూడదు, ఆట కోసం ఆట ఆడాలి ఆనే గౌరు నాయుడు(శివరాజ్ కుమార్) మాటలకు ప్రభావితుడై కుస్తీ పోటీలలో పాల్గొనాలని నిర్ణయించుకుంటాడు. క్రికెట్ కు బై బై చెప్పి గౌరునాయుడి దగ్గర కుస్తీలో శిష్యరికం చేయడానికి వెళతాడు. ఇదే సమయంలో తమ గ్రామ గుర్తింపు, గ్రామస్తుల గుర్తింపుకై జీవితాంతం తపన పడిన పోరాటం చేసిన వ్యక్తి అప్పల దాసు(జగపతి బాబు) చేసిన ప్రాణత్యాగం పెద్ది జీవితాన్ని ఒక మలుపు తిప్పుతుంది. తర్వాత పెద్ది తన గ్రామస్తుల గుర్తింపు, తన గ్రామం గుర్తింపు కోసం ఏం చేశాడు? ఎంత దూరం వెళ్ళాడు అనేది మిగతా కథ. ఈ కథలో ఒక సబ్ ప్లాట్ లాగా అచ్చాయమ్మ (జాన్వీ కపూర్) తో ప్రేమ కథ కూడా ఉంటుంది.

ఇన్ని కోట్ల మంది ఉండే భారత దేశంలో మనకు ఒలింపిక్స్ లో జనాభాకు తగ్గట్టు పతకాలు రావడం లేదు అంటూ నేషనల్ లెవెల్ స్పోర్ట్స్ మీటింగ్ తో సినిమా స్టార్ట్ అవుతుంది. అప్పుడు ఆ మీటింగ్ లో ఉండేవారిలో బొమన్ ఇరానీ మాట్లాడుతూ మనకు ఈ సారి రెండు పతకాలు వచ్చాయి అంటాడు. అప్పుడు ఇంత జనాభాకు రెండే పతకాలా.. ఇలా అయితే స్పోర్ట్స్ ఫెసిలిటీస్ అన్నీ రద్దు చేసి ఆ ఫండింగ్ మిలిటరీకి మళ్లించాల్సి ఉంటుంది అని స్పోర్ట్స్ మినిస్టర్ వార్నింగ్ ఇవ్వడంతో కథ ప్రారంభం అవుతుంది. దీంతో బొమన్ ఇరానీ ఏం చేస్తే ఇండియాకు పతకాలు వస్తాయి అని వాస్తవ పరిస్థితులు తెలుసుకోవడం కోసం తన ప్రయాణం ప్రారంభిస్తాడు. ఆంధ్ర ప్రదేశ్ కు వస్తాడు. అక్కడే పెద్ది పాత్ర ఎంటర్ అవుతుంది. బొమన్ ఇరానీ పెద్ది గురించి తెలుసుకుంటూ వెళతాడు. సినిమా క్లైమాక్స్ కు పెద్ది ప్రయాణం గురించి పూర్తిగా తెలుస్తుంది.

ఫస్ట్ హాఫ్ అంతా పెద్ది గురించి, పెద్ది టాలెంట్ గురించి ఎస్టాబ్లిష్ చేయడంతో సరిపోతుంది. ఒక మంచి ఇంటర్వెల్ ట్విస్ట్ తో బ్రేక్ ఇచ్చినప్పటికీ ఫస్ట్ హాఫ్ ఆంతా కమర్షియల్ టెంప్లేట్ తో హీరో ఎలివేషన్స్ తో సాగుతుంది. నిజానికి ఫస్ట్ హాఫ్ లో ఇంటర్వెల్ ట్విస్ట్ తప్ప మిగతా అంతా సాదాసీదాగా ఉంటుంది. కానీ సెకండ్ హాఫ్‌లోకి వచ్చేసరికి స్పోర్ట్స్ డ్రామా సీరియస్ టర్న్ తీసుకుంటుంది. సెంటిమెంట్ డోస్ కాస్త పెరగడం వల్ల కొన్ని చోట్ల కథనం నెమ్మదించినట్లు అనిపించినా, కొన్ని సన్నివేశాలు కాస్త లెంగ్తీగా అనిపించినా, ప్రీ-క్లైమాక్స్ మరియు క్లైమాక్స్ లో వచ్చే హై-వోల్టేజ్ ఎమోషనల్ సీన్స్ సినిమాను మళ్లీ ట్రాక్‌లోకి తెస్తాయి. స్క్రీన్‌ప్లే అక్కడక్కడా రెగ్యులర్ కమర్షియల్ ఫార్మాట్‌లో సాగినప్పటికీ, కథనం ఎగుడుదిగుడుగా అనిపించినా ఓవరాల్ గా సినిమా ఓకే అనిపిస్తుంది.

రామ్ చరణ్ 'పెద్ది' పాత్రలో ఒదిగిపోయాడు. ఈ పాత్ర కోసం చరణ్ పడ్డ కష్టం, మేకోవర్ ప్రతి ఫ్రేమ్‌లోనూ కనిపిస్తుంది. రెజ్లింగ్ సీన్స్‌లో, ఎమోషనల్ డైలాగ్స్ చెప్పేటప్పుడు చరణ్ నటన నెక్స్ట్ లెవెల్ అని చెప్పొచ్చు. నిజానికి సినిమా చాలా చోట్ల బోరింగ్ అనిపించినా చరణ్ నటన, తన మేకోవర్ వల్ల ఆ లోపాలన్నీ కవర్ అయినట్టు ఉంటాయి. ఈ సినిమాలో హీరో పాత్ర చాలా బలంగా ఉంది కానీ జాన్వీ కపూర్ పాత్ర మాత్రం ఉన్నా లేకపోయినా ఒకటే. నిజానికి ఈ సినిమాలో హీరోయిన్ పాత్రను ఇరికించినట్టు అనిపిస్తే అది ప్రేక్షకుల తప్పేమీ కాదు. పైగా జాన్వీ పల్లెటూరి అమ్మాయిగా సూట్ కాలేదు. క్యారెక్టరైజేషన్ కూడా బలహీనంగా




ఉంది. కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ స్క్రీన్ ప్రెజెన్స్ సినిమాకు ఒక పెద్ద అసెట్. అయితే ప్రీ క్లైమాక్స్ వరకూ శివరాజ్ కుమార్ పాత్ర బలంగా ఉన్నప్పటికీ క్లైమాక్స్ వచ్చేసరికి పెద్దగా ప్రాధాన్యత లేని పాత్రగా మారిపోతుంది. గ్రామం కోసం తపన పడే వ్యక్తిగా జగపతి బాబు తన పాత్రకు వంద శాతం న్యాయం చేశాడు. సినిమాలో చాలా పాత్రలు ఉన్నప్పటికీ ప్రేక్షకులకు రిజిస్టర్ అయ్యే పాత్రలను మాత్రం వేళ్ళ మీద లెక్క పెట్టవచ్చు.

ఏ.ఆర్. రెహమాన్ అందించిన సంగీతం అద్భుతంగా అయితే లేదు. రెండు పాటలు బాగున్నాయి. మిగతావి యావరేజ్. నేపథ్య సంగీతం విషయానికి వస్తే కొన్ని చోట్ల గొప్పగా ఉంది కానీ కొన్ని చోట్ల మాత్రం చప్పగా ఉంది. ఓవరాల్ గా చెప్తే అత్తెసరు మార్కులే ఇవ్వాలి. ఆర్. రత్నవేలు సినిమాటోగ్రఫీ అద్భుతంగా ఉంది, ప్రతి విజువల్ చాలా రిచ్‌గా, సహజంగా ఉంటూ గ్రామీణ అందాలను, యాక్షన్ సీన్స్‌ని అద్భుతంగా క్యాప్చర్ చేసింది. నవీన్ నూలి ఎడిటింగ్ ఇంకొంత షార్ప్ గా ఉండాల్సింది, సెకండ్ హాఫ్‌లో కొన్ని సాగదీత సీన్లను కాస్త ట్రిమ్ చేసి ఉంటే బాగుండేది. మూడు గంటల 9 నిముషాల నిడివి ఎక్కువే అని చెప్పాలి. ఇక రైటింగ్ విషయానికి వస్తే కొన్ని డైలాగులు బాగున్నాయి కానీ స్క్రీన్ ప్లే లోపాల వల్ల సినిమా అంతా ఒక ఫ్లో లో ఉన్నట్టు అనిపించదు. చాలా చోట్ల లాజిక్ లను గాలికి వదిలేశారు. సినిమాటిక్ లిబర్టీ వీలైనంత ఎక్కువ తీసేసుకున్నారు. లాజిక్ లను పట్టి పట్టి చూసే ప్రేక్షకులకు ఈ సినిమా నచ్చడం కష్టమే. లాజిక్ లను పక్కన పెట్టి కమర్షియల్ సినిమా ను ఎంజాయ్ చేద్దాం అనేవారికి పెద్ద ఇబ్బంది ఉండదు.

### సినిమాలో ఏం బాగున్నాయో తెలుసా?

1. రామ్ చరణ్ వన్-మ్యాన్ షో ‌ మేకోవర్
2. ఇంటర్వెల్ బ్యాంగ్ , ప్రీ క్లైమాక్స్ నుంచి చివర వచ్చే షాకింగ్ క్లైమాక్స్ ఎపిసోడ్స్
3. రత్నవేలు విజువల్స్

### సినిమాలో బాగలేనివి ఇవి:

1. జాన్వి కపూర్ లవ్ ట్రాక్
2. రొటీన్ ఫస్ట్ హాఫ్
3. చాలా చోట్ల ఎమోషనల్ కనెక్ట్ మిస్ అవ్వడం

**రేటింగ్: 2.5 / 5**

**ఫైనల్ వర్డ్: పెద్ది కాదు కమర్షియల్ చద్ది!**



## ఇది 'మిరాయి' మెరాకిల్ అందం

యువ కథానాయిక రితికా నాయక్ టాలీవుడ్‌లో వేగంగా గుర్తింపు తెచ్చుకుంటున్న నటి. అందమైన స్క్రీన్ ప్రెజెన్స్, హావభావాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఆమె, విభిన్న పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. 2025లో విడుదలైన ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం మిరాయి ద్వారా రితికాకు మరింత క్రేజ్ లభించింది. ఈ పాన్-ఇండియా చిత్రంలో ఆమె నటనకు మంచి ప్రశంసలు దక్కగా, పలు భాషల్లో అభిమాన వర్గాన్ని పెంచుకుంది.

Printed and published by oktelugu Chairmen Bhaskar Rao Katiki, on behalf of Swarna Enterprises Private Limited. Hitec ciry, Hyderabad-500030.
Editor: A.Naresh email: oktelugu.com@gmail.com